సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి : కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, ఆగస్టు 8 : అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల్లో పూర్తయిన పనులు గుర్తించి ఎంబీలో నమోదు చేయించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, హెచ్ఎంలతో పనులు పూర్తయినట్లు సర్టిఫై చేయించాలని సూచించారు. ఏవైనా పాఠశాలల్లో పనులు మిగిలి ఉంటే వాటికి త్వరగా అంచనాలు రూపొందించి సంబంధిత అధికారులకు సమర్పించాలన్నారు. మంజూరైన పనులను త్వరగా ప్రారంభించేటట్లు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రిసిటీ, మైనర్ రిపేర్లు, తాగునీరు, టాయిలెట్లు మొదలైన పనులను వేగవంతంగా పూర్తి చేయించాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ఉన్నతీకరణలో భాగంగా చేస్తున్న పెయింటింగ్స్, టాయిలెట్స్, తాగునీరు, ఎలక్ట్రిసిటీ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో విద్యాలత, డీఆర్డీఏ పీడీ నాగపద్మజ, డీఈవో అబ్దుల్ హై, సీపీవో సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వంట చేస్తుండగా ఫిట్స్ వచ్చి..

మంటలో పడి మహిళకు తీవ్రగాయాలు ■ మిరపకుంటతండాలో ఘటన

వేలేరు, ఆగస్టు 8 : ప్రమాదవశాత్తు మంటలో పడి మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలో గురువారం జరిగింది. అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మిరపకుంటతండాకు చెందిన ముడావత్ మానస ఇంటి వద్ద వంట చేస్తుండగా ఫిట్స్ వచ్చి మంటల్లో పడింది. గమనించిన బంధువులు వెంటనే అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. మానస ముఖం, చేతులకు తీవ్రగాయాలైనట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

రైలు కింద పడి ఒకరి మృతి

ఎల్కతుర్తి, ఆగస్టు 8 : మండలంలోని దండేపల్లి-బావుపేట మధ్యలో రైల్వే ట్రాక్‌పై గురువారం ఒకరి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వారి సమాచారంతో కాజీపేట రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు మహబూబ్‌నగర్‌కు చెందిన కొండూరి హన్మంతు(35)గా గుర్తించినట్లు రైల్వే ఎస్సై మెయినుద్దీన్ తెలిపారు. అతడు దక్షిణ ఎక్స్‌ప్రెస్‌లో నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బఫర్ జోన్‌గా నిర్ధారించాలి

భద్రకాళి బండ్ అభివృద్ధి సమితి అధ్యక్షుడు మర్రి రవీందర్

వరంగల్, ఆగస్టు 8 : భద్రకాళీ బండ్ వెనుక ప్రాంతాన్ని రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలని కోరుతూ భద్రకాళీ బండ్ అభివృద్ధి సమితి అధ్యక్షుడు మర్రి రవీందర్ గురువారం సిటీ ప్లానర్ శైలజకు వినతి పత్రం అందజేశారు. గతంలో బండ్ బఫర్ జోన్ నిర్ణయించే బాధ్యతలను రెవెన్యూ అధికారులకు అప్పగించారని, ఆరేళ్ల నుంచి పెండింగ్‌లో ఉందని వారు తెలిపారు. ప్రస్తుతం అనేక మంది గృహాలు నిర్మించుకొని నివాసముంటున్నారని, త్వరగా బఫర్ జోన్ నిర్ణయించాలని కోరారు. జలంధర్, సంజీవ్, వలబోజు శ్రీనాథ్, రమోజు రవి, సమ్మయ్య, సాయిలు, అవినాశ్ పాల్గొన్నారు.

కేయూలో 'జితారా.ఏఐ' ఇంటర్వ్యూలు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 8: కేయూ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ, ఇంజినీరింగ్(కో-ఎడ్యుకేషన్)లో హైదరాబాద్‌లోని 'జితారా.ఏఐ' సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు చేపట్టినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మహేందర్ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో చివరి సంవత్సరం చదువుతున్న అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. రాత పరీక్ష, టెక్నికల్, హెచ్ఆర్ పరీక్షల ద్వారా 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వెల్లడించారు. వారికి వార్షిక వేతనం రూ.5.50 నుంచి రూ.7 లక్షల వరకు ఉంటుందని, వీరి నియామకం జూన్ 2025 నుంచి అమల్లో ఉంటుందన్నారు. నియామక పత్రాలను రిజిస్ట్రార్ పెరటి మల్లారెడ్డికి అందజేశారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు బొల్లం కిరణ్‌కుమార్, రమణబాబు, కంపెనీ ప్రతినిధులు శ్రీవిష్ణు పాల్గొన్నారు.

అర్చక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 8 : అర్చక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని దేవాదాయ ధర్మాదాయ, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావుకు తెలంగాణ అర్చక, ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ వినతిపత్రం అందజేశారు. అర్చక, ఉద్యోగులకు రిటైర్ అయిన పీఆర్సీ ప్రకారం పెన్షన్ సౌకర్యం కల్పించాలని, రిటైర్డ్ గ్రాట్యూటీని రూ.10 లక్షల వరకు అందించాలన్నారు. 5వ జోన్ ఉప కమిషనర్ శ్రీకాంత్‌రావు, జిల్లా కమిషనర్ సునీత, మేడారం ఈవో రాజేందర్, తెలంగాణ అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి తనుగుల రత్నాకర్ ఉన్నారు.

వరంగల్ : నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ ఆలయాన్ని శైలజా రామయ్యార్, హనుమంతరావు, కలెక్టర్ సత్య శారదా దేవి సందర్శించారు. వీరికి ఆలయ ఈవో శేషుభారతి, ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వనమహోత్సంలో పాల్గొని మొక్కలు నాటారు. గోశాలలో గోవులకు గ్రాసం అందించారు. అనంతరం వల్లభ గణపతిని దర్శించుకున్నారు. అనంతరం భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మహామండపంలో వారికి ఆశీర్వచనం చేసి అమ్మవారి ఫొటో, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. దేవాదాయ శాఖ స్థపతి శ్రీవల్లీనాయగం, డీఎఫ్‌వో కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, దేవాదాయ శాఖ డీఈ దుర్గాప్రసాద్, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు, డీఈ రమేశ్, కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు, ఆలయ సూపరింటెండెంట్లు అద్దంకి విజయకుమార్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ స్వాధీనం

ఐనవోలు, ఆగస్టు 8 : మండలంలోని పున్నేల్ శివారులో మొరం టిప్పర్‌ను పట్టుకున్నట్లుగా ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా మొరం రవాణ చేస్తున్నారన్న సమాచారం మేరకు టిప్పర్‌ను సీజ్ చేశామన్నారు. టిప్పర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించి యాజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొరం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, **MD KHAJA SHAMSUDDIN** S/o **Md Khaja Moinuddin** R/o H.No. 2-7-848, Alipura, Subedari, Hanamkonda, Hanumakonda Dist., T.S. In my daughter's Passport my Name has been wrongly mentioned as **MOHAMMED KHAJA SHAMSHUDDIN GULRAIZ** instead of **MD KHAJA SHAMSUDDIN.**

NTW-000

CHANGE OF NAME

★I, the undersigned **MUNDADA TARA** (New name) previously called **TARAKUMARI MUNDADA** (Old Name), W/o **SRINIVAS MUNDADA** R/o. H.No: 8-4-90, Sri Krishna Colony, Station Road, Warangal district-506002, T.S. Solemnly declare.

NTW-17189

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

పేదింటి ఆడబిడ్డకు అండగా 'కల్యాణలక్ష్మి'

- కాంగ్రెస్ తులం బంగారం ఇవ్వాలి
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, ఆగస్టు 8 : పేదింటి ఆడబిడ్డలకు అండగా ఉండేందుకే తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టినట్లు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం కమలాపూర్ రైతు వేదికలో 116 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన డిసెంబర్ 9 తర్వాత జరిగిన పెళ్లిళ్లకు రూ. లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఇచ్చిన రూ.1,00,116 మాత్రమే ఇస్తున్నారని, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో తులం బంగారం ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఏ కుటుంబానికి ఆపద వచ్చినా అండగా ఉంటానని చెప్పారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్‌కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ సత్యనారాయణరావు, నాయకులు రవీందర్‌రెడ్డి, సాంబయ్య, అశోక్, రామస్వామి, ఆర్ఐలు సమ్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : లబ్ధిదారురాలికి కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వేలేరు/ధర్మసాగర్, ఆగస్టు 8 : వేలేరు మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులను గురువారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో అధికారులు ఇబ్బందులకు గురి చేస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. త్వరలోనే అర్హులకు రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామని తెలిపారు. మండల వ్యాప్తంగా 9మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సుమారు 35 మందికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హెచ్ కొమి, ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, మాజీ ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాంగోపాల్‌రెడ్డి, కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కత్తి సంపత్, నాయకులు మల్లికార్జున్, గోదల రాజిరెడ్డి, సద్దాం హుస్సేన్, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే ధర్మసాగర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీహరి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 107 మంది లబ్ధిదారులకు రూ.30,60,500 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ, ఆగస్టు 8 : స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంస్కృతిక కార్యక్రమాలకు బృందాలను సిద్ధం చేయాలన్నారు. అధికారులు, సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాల విషయంలో సేవలు, పారామీటర్స్‌లో సాధించిన ప్రగతిని ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల శకటాలు, స్టాళ్ల ఏర్పాట్లు చూడాలన్నారు. వివిధ శాఖల పథకాలకు సంబంధించి యూనిట్ల గ్రౌండింగ్ పెద్ద ఎత్తున చేసేలా కార్యాచరణ చేయాలని, జాబితా త్వరగా సమర్పించాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అతిథులకు ముందస్తుగా ఆహ్వానాలు అందాలనారు. సమావేశంలో డీఆర్వో వైవీ గణేశ్, జడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్డీవో నాగపద్మజ, సీపీవో సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో లలితాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, డీఈవో అబ్దుల్ హై, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు ఇవ్వాలి

అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులు డిమాండ్ చేస్తూ గురువారం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేసారు. నిరుపేదలకు రేషన్ కార్డులు లేకపోవడంతో సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారని, ఇంటి స్థలం లేని పేదలకు స్థలం ఇచ్చి నిర్మాణానికి రూ. 10లక్షలు ఇవ్వాలనిన్నారు. అలాగే రుణమాఫీ చేయడంతో పాటు కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. వాస్తవ సాగుదారులకు రైతు భరోసా ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు రూ. 12వేల ఆసరా పథకం తక్షణమే అమలు చేయాలని, సంఘటిత, అసంఘటిత కార్మికులకు అండగా నిలువాలని, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, పోడు సాగుదారులకు పట్టాలు ఇచ్చి సాగు హక్కులు కల్పించాలని కొరుతూ వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం సదానంద, హనుమకొండ డివిజన్ నాయకులు అర్షం అశోక్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి మొక్కలు అక్కడేనా ?

శాయంపేట, ఆగస్టు 8 : నర్సరీల్లో ఎక్కడి మొక్కలు అక్కడే ఉండిపోయాయి. వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలను భారీ ఎత్తున నాటాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే మండల పరిధిలో ఆ జాడ కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని 24 పంచాయతీల్లో ఒక్కో నర్సరీలో పండ్లు, పూలు, నీడనిచ్చే పది వేల మొక్కలను పెంచారు. వానలు పడగానే గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ ప్లాంటేషన్ చేపట్టి ప్రతి ఇంటికీ ఆరు మొక్కలను అందించాల్సి ఉన్నది. వన మహోత్సవంలో మొక్కలు నాటాలని, ఇంటింటికీ పంపిణీ చేయాలని సర్కారు సూచించినా ఇక్కడ జరగడం లేదని ప్రజలు చెబుతున్నారు. కొన్నేండ్లుగా జరుగుతున్న తంతే కదా ఏముందిలే అన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఎంపీడీవో ఫణిచంద్రను ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

శాయంపేటలోని నర్సరీలో ఉన్న మొక్కలు

తాగునీటి వృథా

పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు, ఆగస్టు 8 : తాగునీరు వృథాగా పోతున్న పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతేగాకుండా అక్కడక్కడ పబ్లిక్ నల్లాలకు బిరడాలు లేకపోవడంతో నీరు వృథాగా పోతున్నది. ఇటీవల కురిసిన వర్షాలతో మండల కేంద్రంలోని మోడల్ కాలనీలో ఓపెన్ ప్లాట్లలో నీరు నిల్వ ఉండడంతో ఆ కాలనీ అంతా కంపు కొడుతుందన్నారు. సైడ్ కాల్వలు లేక పోవడంతో చెత్తా చెదారంతో పేరుకుపోతున్నదని, దుర్గంధం వెదజల్లుతున్నదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విపరీతమైన దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శికి చెప్పినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

గంజాయి పట్టివేత

కమలాపూర్, ఆగస్టు 8 : మండలంలోని మర్రిపల్లిగూడెం గ్రామ శివారులో గంజాయి అమ్ముతున్న కౌశల్ కేవాట్, ధనుంజయ కుమార్‌ను పట్టుకున్నట్లు సీఐ హరికృష్ణ గురువారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మర్రిపెల్లిగూడెం శివారులో పెట్రోలింగ్ చేస్తుండగా బీహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా 510 గ్రాముల ఎండు గంజాయి, చాక్లెట్ల రూపంలో ఉన్న మరో 75 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు తెలిపారు. వీరు బీహార్ నుంచి గంజాయి తీసుకొస్తూ మండలంలోని యువకులకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. గంజాయిని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

త్వరగా పీహెచ్‌డీ సీట్లు కేటాయించాలి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 8 : కేయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఈసీ) సమావేశం హైదరాబాద్‌లోని రూసా భవనంలో గురువారం నిర్వహించారు. పాలకమండలి సభ్యులను నియమించిన తర్వాత మొదటిసారి నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం గైర్హాజరు కావడంతో తూతూమంత్రంగా నిర్వహించారు. కేయూ ఇన్‌చార్జి వీసీ, ఈసీ చైర్మన్ వాకాటి కరుణ, కేయూ రిజిస్ట్రార్, ఈసీ సెక్రటరీ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బానోత్ సురేశ్‌లాల్, సుదర్శన్, భీమార్తి సుకుమారి, ద్దిరెడ్డి రమ, మల్లం నవీన్, అనిత్‌రెడ్డి, చిర్ర రాజు, చౌహాన్, పుల్లూరి సుధాకర్ పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్యంగా పీహెచ్‌డీ అడ్మిషన్లపై చర్చించారు. పీహెచ్‌డీలో మిగిలిన సీట్లలో అందరికీ అవకాశం కల్పించాలని నిర్ణయించారు. సీసీ కెమెరాలు, వర్సిటీ భూములను కాపాడాలని, కాంపౌండ్ వాల్స్ నిర్మించాలని ప్రతిపాదించారు. శిథిలావస్థకు చేరిన భవనాలు, హాస్టళ్లు, లైబ్రరీకి మరమ్మతులు చేయించాలని నిర్ణయించారు.

పరకాల : ఆర్డీవో నారాయణకు వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

న్యాయవాదులపై దాడికి పాల్పడిన పోలీసులను సస్పెండ్ చేయాలి

పరకాల/వరంగల్ లీగల్, ఆగస్టు 8 : జనగామ న్యాయస్థానంలో విధులు నిర్వర్తిస్తున్న న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బందెల స్వామి డిమాండ్ చేశారు. పరకాల పట్టణంలో బైక్ ర్యాలీ తీసిన అనంతరం ఆర్డీవో నారాయణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కే శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, రాజమౌళి, చంద్రమౌళి, శ్రీనివాస్, నరేశ్‌రెడ్డి, వెంకటరమణ, రాజేందర్, రమేశ్, రాజు పాల్గొన్నారు. అలాగే న్యాయవాద దంపతులపై పోలీసుల దౌర్జన్యానికి నిరసనగా వరంగల్, హనుమకొండ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువల పరిరక్షణకు పాటుపడుతున్న న్యాయవాదులపై ఇటీవల పోలీసుల దౌర్జన్యాలు పెరిగిపోయాయని వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్ పేర్కొన్నారు. విధులు బహిష్కరించిన న్యాయవాదులు కోర్టు ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్దకు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేశ్ బాబు, ప్రధాన కార్యదర్శిలు ముదసిర్ అహ్మద్, లాడె రమేశ్, బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్, అసోసియేషన్ నాయకులు ముద్దసాని సహోదర రెడ్డి, అంబరీశ్‌రావు, చోల్లేటి రామకృష్ణ, చిల్లా రాజేంద్రప్రసాద్, వద్దిరాజు గణేశ్, రంజిత్, వలస సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

దామెర, ఆగస్టు 8 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎంపీపీ కాగితాల శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులను ఆపేశారన్నారు. దీంతో పులుకుర్తి, ల్యాదెళ్ల, దామెర, కోగిల్వాయి తదితర గ్రామాల పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వసతులు కల్పించాలని కోరారు.

అదాలత్ నుంచి ఇన్నోవేషన్ ర్యాలీ

హనుమకొండ, ఆగస్టు 8 : టీఎస్ఐసీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటా ఇన్నోవేటర్‌లో భాగంగా గురువారం హనుమకొండలోని అదాలత్ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీని ఏసీపీ నవీన్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రమంతటా గ్రామీణ స్థాయి నుంచి ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ద్వారా ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

పరకాల, ఆగస్టు 8 : నియోజవర్గ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకపోతే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమాచార లోపం లేకుండా పని చేయాలన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం పనుల పరిశీలన

పెద్దపెండ్యాల, కరుణాపురం గ్రామాలు సందర్శించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకాధికారి హరిత

ధర్మసాగర్, ఆగస్టు 8 : హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల, కరుణాపురం గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం పనులను గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకాధికారి హరిత, కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా 4వ రోజు గ్రామాల్లో చేస్తున్న పనులను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను పరిశీలించారు. వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవడం వల్ల దోమలను నియంత్రించొచ్చని తెలిపారు. అనంతరం గ్రామంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. జడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్డీవో నాగపద్మ, డీపీవో లక్ష్మీరమాకాంత్, ఎంపీడీవో అనిల్, ఎంపీవో సయ్యద్ అఫ్జల్ పాల్గొన్నారు.

పెద్దపెండ్యాలలో అధికారులకు సూచనలిస్తున్న హరిత

అటవీ శాఖ ఆఫీస్‌లో స్వచ్ఛదనం - పచ్చదనం

హనుమకొండ : సుబేదారిలోని భద్రాద్రి జోన్ సర్కిల్ ఆఫీస్ ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో గురువారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. కాంప్లెక్స్‌లో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ డీఎఫ్‌వోలు లావణ్య, అనూజ్ అగర్వాల్, రేంజ్ ఆఫీసర్లు భిక్షపతి, సందీప్‌రెడ్డి, శిరీష, కాకతీయ జూపార్క్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పరకాల : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత-రామకృష్ణ అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో స్వచ్ఛదనం-పచ్చదనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అందించిన మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నర్సింహ, కౌన్సిలర్ పసుల లావణ్య రమేశ్ పాల్గొన్నారు.

న్యూశాయంపేట : అభివృద్ధిలో భాగమే 'స్వచ్ఛదనం - పచ్చద